తలసరి విద్యుత్తు వినియోగం తగ్గిందా? పెరిగిందా?

- వివరాలు వెల్లడించని సర్కారు
- కొత్త నివేదికలో పాత వివరాలు

అభివృద్ధి సూచికల్లో తలసరి విద్యుత్తు వినియోగం ఒకటి. కాంగ్రెస్ సర్కారు కొలువుదీరిన తర్వాత రాష్ట్రంలో తలసరి విద్యుత్తు వినియోగం తగ్గిందా? పెరిగిందా? అనే వివరాలను మాత్రం సర్కారు గోప్యంగా ఉంచింది. సోమవారం విడుదల చేసిన తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రక్ట్-2024 నివేదికలో పాత వివరాలనే పొందుపరిచింది. 2022-23లో రాష్ట్రంలో తలసరి విద్యుత్తు వినియోగం 2,349 యూనిట్లు ఉన్నట్టుగా ప్రకటించింది. 2023-2024, 2024-25 సంవత్సరాల వివరాలను నివేదికలో వెల్లడించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. జాతీయ తలసరి విద్యుత్తు వినియోగం కేవలం 1,331 యూనిట్లు ఉండగా, కేసీఆర్ పాలనలో 2,349 యూనిట్లుగా ఉన్నట్టు ఈ నివేదిక పేర్కొన్నది. మరి కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత ఇది తగ్గిందా? పెరిగిందా? అనే వివరాలను ప్రభుత్వం పొందుపర్చలేదు.

20 శాతానికి పైగా విద్యార్థుల డ్రాపౌట్లు

రాష్ట్రంలోని 14 జిల్లాల్లో విద్యార్థుల డ్రాపౌట్ల శాతం 20 శాతాన్ని దాటింది. డ్రాపౌట్లలో ఈ 14 జిల్లాలు రెడ్ జోన్‌లో ఉన్నాయి. మరో 10 జిల్లాల్లో 10 శాతం నుంచి 19 శాతం విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రక్ట్-2024లో వెల్లడించింది. రాష్ట్రంలో 14-15 ఏండ్ల మధ్య వయస్కులు 11.44 లక్షలుంటే కేవలం 10 లక్షల మంది మాత్రమే పాఠశాలల్లో నమోదయ్యారు. రాష్ట్రంలో 8వ తరగతి పూర్తి చేసిన తర్వాత విద్యార్థుల్లో అత్యధికులు డ్రాపౌట్ అవుతున్నారు. 9, 10 తరగతుల్లో డ్రాపౌట్ రేట్ అధికంగా ఉంది. ఇక ఉన్నత పాఠశాలల్లో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో 17 జిల్లాల్లో అతి తక్కువగా ఉంది. ఈ జిల్లాల్లో ఒక్కో స్కూల్లో సగటు విద్యార్థుల సంఖ్య 80 లోపే ఉంది. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో సగటు 149గా ఉంది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో సగటు 100లో ఉన్న జిల్లాలు 23 ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో సగటున విద్యార్థుల సంఖ్య 100లోపు ఉన్నవి 20 జిల్లాలు ఉన్నాయి.

ఏడేండ్ల కేసీఆర్ పాలన తెలంగాణ అగ్రపథాన

మొదటిపేజీ తరువాయి...

రూపొందించిన తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్(అట్లాస్) పుస్తకాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆవిష్కరించారు.

అన్నపూర్ణలా మారిన తెలంగాణ

కేసీఆర్ అమలు చేసిన పథకాలు రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని, సంక్షేమాన్ని పెంచిందని కాంగ్రెస్ సర్కారు ఈ నివేదికలో పేర్కొన్నది. ఇందుకోసం ప్రభుత్వం కాళేశ్వరం, మిషన్ కాకతీయ, 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు పెట్టుబడి సాయం పథకం, రైతుబీమా పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేసినట్టు వెల్లడించింది. ఈ పథకాల ఫలితంగా రాష్ట్ర ఆదాయంలో వ్యవసాయ రంగం వాటా 155.7 శాతం పెరిగిందని, పంటల సాగు, ఉత్పత్తిలో గణనీయమైన వృద్ధి నమోదైనట్టుగా పేర్కొన్నది. బియ్యం ఉత్పత్తిలో 1.68 కోట్ల టన్నులతో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ 1గా నిలిచినట్టు తెలిపింది.

ఆర్థిక ప్రగతిలో అగ్రభాగాన తెలంగాణ

కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధి గణనీయంగా జరిగిందని, దేశ సగటుతో పోల్చుకుంటే తెలంగాణ అధికంగా, వేగంగా వృద్ధిని నమోదు చేసినట్టు గణాంకాలు స్పష్టం చేశాయి. తలసరి ఆదాయంలోనూ తెలంగాణ అగ్రభాగాన నిలిచినట్టు వెల్లడైంది. తెలంగాణ ఏర్పాటు తరువాత దేశ సగటుతో పోల్చుకుంటే తెలంగాణ రాష్ట్రం దేశీయ స్థూల ఉత్పత్తి(జీఎస్‌డీపీ)లో ప్రతి ఏటా వృద్ధిని నమోదు చేసింది. 2023-24లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.15, 01,981కోట్లతో 14.5 శాతం వృద్ధి నమోదైందని వెల్లడించింది. జీఎస్‌డీపీ వృద్ధిలో నాన్ స్పెషల్ క్యాటగిరీ రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం నంబర్-1గా నిలిచినట్టు పేర్కొన్నది.

వ్యవసాయ రంగంపై కీలకాంశాలు

- 2014-15లో రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 68.17 లక్షల టన్నులు ఉండగా, 2023-24లో 260.88 లక్షల టన్నులకు పెరిగింది.
- వరి సాగు 2014-15లో 34.97 లక్షల ఎకరాలు కాగా 2023-24లో 1.18 కోట్ల ఎకరాలకు పెరిగింది.
- 2014-15లో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాలు ఉండగా 2023-24లో ఏకంగా 2.09 కోట్ల ఎకరాలకు పెరిగింది.
- 2023-24లో రుణమాఫీ కింద 22.05 లక్షల మంది రైతులకు సంబంధించి రూ.17, 770 కోట్లను మాఫీ చేసినట్టు పేర్కొంది.

వరి, పత్తి ఉత్పత్తి (లక్షల ఎకరాలు, లక్షల టన్నులు)

పంటరకం	2014-15		2023-24	
	విస్తీర్ణం	ఉత్పత్తి	విస్తీర్ణం	ఉత్పత్తి
వరి	34.97	68.17	118.10	260.88
పత్తి	41.83	18.45	44.92	26.34

పాలు, మాంసం ఉత్పత్తి (లక్షల టన్నులు)



కేసీఆర్ పాలనలో ఆర్థిక వృద్ధి ఇలా..

- 2014-15లో రూ.5,05,849 కోట్లుగా ఉన్న తెలంగాణ జీఎస్‌డీపీ 2023-24లో 196.9 శాతం వృద్ధితో రూ. 15,01, 981కోట్లుగా నమోదైంది. అదే సమయంలో దేశ జీడీపీ వృద్ధి మాత్రం 136.89 శాతంగానే ఉంది.
- తెలంగాణ ఏర్పాటు అనంతరం 12.9 శాతం సగటు జీఎస్‌డీపీ వృద్ధితో దేశ సగటు వృద్ధి రేటు 10.3 కన్నా 2.6 శాతం అధికంగా తెలంగాణలో నమోదైంది.
- 2014-15 నుంచి 2023-24 మధ్య తెలంగాణ రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు 12.9శాతంతో అన్ని దక్షిణాది రాష్ట్రాలను అధిగమించింది.
- దేశ జీడీపీలో తెలంగాణ వాటా 2014-15లో 4.1శాతం ఉండగా, 2023-24లో 5.1శాతానికి పెరిగింది.
- జనాభాపరంగా చూస్తే దేశ జనాభా మొత్తంలో తెలంగాణలో 2.8 శాతమే ఉన్నప్పటికీ దేశ జీడీపీలో మాత్రం 5.1శాతం వాటాను సమకూర్చింది.
- 2023-24లో దేశ తలసరి ఆదాయం రూ.1,84,205 ఉండగా, తెలంగాణలో రూ. 3,56,564తో నాన్ స్పెషల్ కేటగిరీ(ఎన్ఎస్‌సీ) రాష్ట్రాల్లో అగ్రభాగాన నిలిచింది.

లోకం పోకడ

మున్సిపాలిటీల్లో పరిశుభ్రత గురించి స్వయంగా అధికారులు పర్యవేక్షిస్తున్నారు!

ఫిబ్రవరిలోనే సూర్యప్రతాపం

- రాష్ట్రంలో దంచికొడుతున్న ఎండలు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో ఫిబ్రవరిలోనే ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 11 గంటలు దాటితే ఎండ దంచేస్తున్నది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35.6 డిగ్రీల నుంచి 37.7 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. కామారెడ్డి జిల్లా పిట్లంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 37.7 డిగ్రీలుగా రికార్డు అయ్యింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ-గద్వాల, కరీంనగర్, ఖమ్మం, కుమ్రంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, వనపర్తి, సంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, నిర్మల్, పెద్దపల్లి, నారాయణ్‌పేట్, నల్లగొండ జిల్లాల్లో 37.6 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 1 నుంచి 2 డిగ్రీలు పెరిగే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

వాయిదాల భరోసా

మొదటిపేజీ తరువాయి...

పంపిణీని ప్రారంభించి 22 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు మూడెకరాల వరకు మాత్రమే పూర్తయింది. ఈ సీజన్‌లోనూ గత యాసంగి మాదిరిగానే పంటల కోతల సమయంలో జమవుతుందేమోననే చర్చ రైతుల్లో జరుగుతున్నది.

మూడెకరాలు... నాలుగు వాయిదాలు

ఇప్పటి వరకు మూడెకరాలకు పంపిణీ జరగగా.. సర్కారు నాలుగు వాయిదాలు వేసింది. జనవరి 26న పైలట్ గ్రామాల్లో 4.41 లక్షల మంది రైతులకు రూ.568.99 కోట్లు జమ చేసింది. ఆ తర్వాత తొమ్మిది రోజులకు ఫిబ్రవరి 5న ఎకరం భూమి కలిగిన 17.03 లక్షల మంది రైతులకు రూ.557.54 కోట్లు జమ య్యాయి. ఆ తర్వాత ఐదు రోజులకు 10న రెండెకరాల రైతులకు భరోసా అందింది. అనంతరం రెండు రోజులకు 12న మూడెకరాల రైతులకు జమ చేసింది. ఈ లెక్కన 13న నాలుగెకరాల రైతులకు రైతుభరోసా జమ కావాలి. కానీ, ఇప్పటికే ఆరు రోజులు గడుస్తున్నా.. నాలుగెకరాల రైతులకు రైతుభరోసా పత్తా లేదు.

బీఆర్ఎస్ హయాంలో రంచన్‌గా...

బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు పంపిణీ ప్రారంభమైన తర్వాత రోజుకు ఎకరం చొప్పున పదిహేను రోజుల్లో మొత్తం రైతులకు పెట్టుబడి సాయం జమ యయ్యేది. తమకు ఏ రోజున అందుతుందో రైతులే లెక్కలేసుకునేవారు. కానీ, కాంగ్రెస్ హయాంలో రైతుభరోసా పంపిణీపై ఏర్పడిన గందరగోళంతో రైతుల్లో ఆందోళన నెలకొన్నది. వాయిదాలపై వాయిదాలు వేస్తుండటంతో రైతుల్లో అసహనం పెరిగిపోతున్నది. ఇప్పటివరకు 44.82 లక్షల మంది రైతులకు భరోసా అందగా.. ఇంకా 30 లక్షల మందికి రూ.5,500 కోట్లు రావాల్సి ఉంది.

మూడెకరాల రైతులందరికీ జమ కాలేదు

మూడెకరాల వరకు రైతులకు భరోసా జమ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పది గుంటలు, ఎకరం, రెండెకరాలు గల రైతులు కూడా తమకు ఇంకా అందలేదని చెబుతున్నారు. ఆయా రైతులు అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇదిలా ఉంటే 8,500 సర్వే నంబర్లలోని పలువురు రైతుల 2 లక్షల ఎకరాలను ప్రభుత్వం బ్లాక్ చేసినట్టు తెలిసింది. ఇప్పుడు వారంతా లబోదిబోమంటున్నారు.

మాజీ సర్పంచ్ ఇంటి ఎదుట ఆత్మహత్యాయత్నం

తన భూమిని అక్రమించారని వృద్ధుడి మనస్తాపం

బాధితుడు రాచర్ల బక్కయ్య

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 17: తన భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నాడని ఆరోపిస్తూ మాజీ సర్పంచ్ ఇంటి ఎదుట ఓ వృద్ధుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బక్కయ్యకు ఇద్దరు కుమారులు. ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. తన భూమిని మాజీ సర్పంచ్ రాచర్ల సారయ్య అక్రమంగా పట్టా చేసుకున్నాడని పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. పెద్దలు చెప్పినా వినకపోవడంతో విసుగు చెందిన బక్కయ్య .. రాచర్ల సారయ్య ఇంటికి పురుగుల మందు డబ్బాతో వెళ్లాడు. భూమిని తనకు పట్టా చేయాలని ఆవేదనతో విలపిస్తూ పురుగులమందు తాగాడు. గమనించిన స్థానికులు బక్కయ్యను ముల్కనూరులోని ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. బక్కయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

- పత్తి కొనడం లేదంటూ రైతుల ఆందోళన



పత్తి కొనుగోలు చేయనందుకు నిరసనగా మంచిర్యాల జిల్లాలోని పలు మండలాల రైతులు బెల్లంపల్లిలోని శ్రీరామ జిన్నింగ్ మిల్లు వద్ద ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. సీసీఐ అధికారులు పత్తిని కొనుగోలు చేయకపోవడం వల్ల వారం నుంచి పడిగాపులు కాస్తున్నామని, వాహనాల కిరాయి భారం పడుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. -బెల్లంపల్లి

- తీరని యూరియా కష్టాలు



కరీంనగర్ జిల్లా మానకొండూరులోని విశాల సహకార పరపతి సంఘం వద్ద యూరియా కోసం రైతులు బారులుదీరారు. మానకొండూరు, ముంజంపల్లి, జగ్గయ్యపల్లి రైతులు సాయంత్రం 5 వరకు పడిగాపులు కాచారు. యూరియా పంపిణీలో ప్రభుత్వం నిర్లక్ష్యంపై మండిపడ్డారు. అదనపు వసూళ్లపై అసహనం వ్యక్తంచేశారు. -మానకొండూర్ రూరల్

- సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం అన్నారంలో పంటలకు నీళ్లివ్వాలని రైతులు రోడ్డుపై ధర్నా చేశారు. ఎంజీకేఎల్ఐ డిస్ట్రిబ్యూటరీ-8, మేజర్ కాల్వ-4 నుంచి పంటలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కాల్వల్లో పేరుకుపోయిన పూడిక తీయాలని, లింక్ కాల్వల పనులు పూర్తి చేయాలని కోరారు. గంటన్నరపాటు ఆందోళన కొనసాగడంతో వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. -పాన్‌గల్, వనపర్తి జిల్లా

కడుపుమండి.. బైకుకు మంటపెట్టి

- రుణమాఫీ, భరోసా రాలేదని నాగర్‌కర్నూల్ రైతు ఆవేదన

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 17 : పూర్తిస్థాయిలో రుణమాఫీ, రైతుభరోసా రాకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ రైతు తన బైక్‌కు నిప్పుపెట్టాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో సోమవారం చోటుచేసుకున్నది. తెలకపల్లి మండలం గోలగుండం గ్రామానికి చెందిన రైతు చందు తల్లి నిరంజనమ్మ పేరిట 2. 15 ఎకరాల పొలం ఉన్నది. బ్యాంకులో వడ్డీతో కలిపి లక్షకు పైగా అప్పు మిగిలింది. రుణమాఫీలో రూ.95 వేలు మాత్రమే మాఫీ అయ్యింది. రూ.13 వేలు అప్పు కట్టాల్సి ఉన్నది. భూమి పట్టాపాస్ పుస్తకాలు అవసరమై సోమవారం చందు బ్యాంకుకు వెళ్లి అధికారులను అడిగాడు. అప్పు మొత్తం చెల్లించి పాస్ పుస్తకాలు తీసుకెళ్లాలని అధికారులు సూచించారు. దీంతో రైతు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బయటకు వచ్చి తన బైక్‌కు నిప్పంటించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పి అతడిని అదుపులోకి తీసుకొన్నారు.

ఓవర్‌లోడ్‌తో ఆగిన ఆర్టీసీ బస్సు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 17: ఆర్టీసీ బస్సు గాడి తప్పుతున్నది. మహిళలకు ఉచిత బస్సు స్కీమ్‌తో ఓవర్ లోడ్ సమస్య వేధిస్తున్నది. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వన్‌పల్లి నుంచి సిరిసిల్లకు వెలుతున్న బస్సులో 110 మంది ప్రయాణికులు ఎక్కగా ఓవర్‌లోడ్ కారణంగా అల్మాస్‌పూర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయం వద్ద నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పరిమితికి మించి ఎక్కించుకోవడం సరికాదని, ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. అదనపు బస్సులు నడపాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని కోరారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లో ఓవర్‌లోడ్ కారణంగా నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కాట్రేపల్లిలో సర్వే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పురుగులమందు డబ్బాతో వచ్చిన యువరైతుతో మాట్లాడుతున్న పోలీసులు

పేట-కొడంగల్ లిఫ్ట్ సర్వేపై కన్నెర్ర

- మక్తల్ మండలం కాట్రేపల్లిలో ఉద్రిక్తత
- తమ భూములు ఇచ్చేది లేదన్న రైతులు
- పురుగుమందు డబ్బాతో వచ్చిన రైతు
- పోలీసుల పహారాలో సర్వే కొనసాగింపు

మక్తల్, ఫిబ్రవరి 17 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల సర్వేకు రైతుల నుంచి అడుగడుగునా నిరసన సెగ తగులుతున్నది. సోమవారం మరోసారి రైతులు పనులను అడ్డుకునేందుకు యత్నించారు. మక్తల్ మండలం కాట్రేపల్లి వద్ద మొదటి దశ పంప్‌హౌస్ నిర్మాణానికి భూసేకరణ కోసం అధికారులు చేపట్టిన సర్వే పోలీసుల పహారాలో కొనసాగింది. సర్వే నిలిపివేయాలని విన్నవించినా పట్టించుకోవడం లేదని పురుగుల మందు డబ్బాతో ఓ రైతు అధికారుల వద్దకు వెళ్తుండగా.. పోలీసులు అడ్డుకున్నారు. రైతులు సర్వే అధికారుల వద్దకు వెళ్లకుండా నిలువరించారు. తమకు తెలియకుండా సర్వే ఎలా చేస్తారని రైతులు నిలదీశారు. మక్తల్ తహసీల్దార్ సతీశ్ రైతులతో మాట్లాడారు. భూమి ఎంత పోతుందో తెలుసుకోవడానికే సర్వే చేస్తున్నట్టు చెప్పారు. ఇది ఫైనల్ సర్వే కాదని , ఉన్నతాధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. పోలీసులే అడ్డుకుంటుంటే సమస్యలు ఎవరికి విన్నవించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

చలివాగు వద్ద గండ్ర ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

రైతుల్ని ఆగం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆగ్రహం
- రైతులతో కలిసి వాగుల పరిశీలన
- నీటిని విడుదల చేయాలని ధర్నా

టేకుమట్ల, ఫిబ్రవరి 17: మానేరు, చలివాగులు ఎండిపోయి రైతులు ఆందోళన చెందుతుంటే అవగాహన లేని కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేస్తున్నదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి మండిపడ్డారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల- గుమ్మడవెల్లి గ్రామాల మధ్యలో చలివాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ వద్ద రైతులు, బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. గండ్ర వెంకటరణా రెడ్డి హాజరై ఎండిపోయిన చెక్‌డ్యామ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయంపై పూర్తి అవగాహన ఉన్న కేసీఆర్ సముద్రంలో కలిసే జలాలను బీడు భూములకు మళ్లించి సస్యశ్యామలం చేశారని తెలిపారు. అలాంటి నాయకుడి పాలన ఒక్క ఏడాది లేకపోయే సరికి అన్నదాతలు అరిగోస పడే దుస్థితి వచ్చిందని చెప్పారు. అన్నారు. కేసీఆర్ పాలనలో మండలంలో కోట్ల రూపాయలతో చెక్ డ్యాం నిర్మించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ఎండబెట్టి రైతుల కడుపు మంటకు కారణమైందని విమర్శించారు. వెంటనే చలివాగులోకి నీటిని వదిలి చెక్ డ్యామ్ నింపడంతోపాటు, డీబీఎం కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ధర్నాలు ఉధృతం చేస్తామని చెప్పారు.